క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం


విరాళమిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అన్నదానం ట్రస్ట్‌కు మంగళవారం గుడిపాల మండలం పెరుమాళ్ల కుప్పంకు చెందిన నాగిరెడ్డి లక్ష రూపాయలను విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఆయాలను విధుల్లోకి చేర్చుకోవాలి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బంగారుపాళెం: ప్రభుత్వ పాఠశాలలో తొలగించిన ఆయాలను వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని రాష్ట్ర ఆయాల వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు జయకుమారి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ, మండలంలోని కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదేళ్లుగా ఆయా పనిచేస్తున్న పుంగోడిని రాజకీయ కక్షతో తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ మారినప్పుడల్లా చిరుద్యోగులు, కార్మికులను రాజకీయ వేధింపులతో బలిపశువులను చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయాలను విధుల్లోకి తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఆర్‌సీలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

'మినీ గోకులం' పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న జేడీ ప్రభాకర్

ఐరాల: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. మినీ గోకులం షెడ్ల మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ, మండలంలో 85 మందికి మినీ గోకులం షెడ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు వీటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. షెడ్లలో ఒక లైట్, ఫ్యాన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ ఆరిఫ్, సహాయ సంచాలకులు పద్మావతి, ఎంపీడీఓ ధనలక్ష్మి, ఏపీఓ సంధ్య, పశు వైద్యాధికారి పినాకపాణి తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: గోకులం షెడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఎంపీడీఓ నాగరాజు కోరారు. మండలంలో గోకులం షెడ్లు మంజూరైన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పాడి రైతులకు రాయితీతో మంజూరు చేసిన గోకులం షెడ్ల పనులను ప్రారంభించిన నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ పూర్తి చేయించాలన్నారు. ఏపీఓ సౌభాగ్యవతి, వైద్యాధికారి దీపాని పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి


గాజులపల్లెలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ కోరారు. మంగళవారం మండలంలోని గాజులపల్లె, గోవిందరెడ్డిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగుపై గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. రైతులు సీజన్‌లో ఎలాంటి పంటలు సాగు చేయాలో వివరించారు. మోతాదుకు మించి మందులు వాడకూడదన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించి దాని ఆధారంగా పంటలు పండిస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. రైతులు తొలుత విత్తనశుద్ధి చేయించాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్, వెటర్నరీ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం..ప్రయాణం నరకం


ముద్దురామాపురం వద్ద జాతీయ రహదారి దుస్థితి


మార్లబండ వద్ద గుంతలమయమైన రహదారి

ఎటుచూసినా మోకాలి లోతు గుంతలు..వర్షం కురిస్తే చిన్నపాటి కుంటలను తలపిస్తున్న ఆ గుంతల్లో నీరు..ఇవీ పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి మండల రహదారుల దుస్థితి. నీరో, గుంతలో తెలియక అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్న మోటార్ సైక్లిస్టులకులెక్కలేదు. ఫలితంగా ఈ మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పాలకులు మాత్రం రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- వర్షాలకు గుంతలయమైన రహదారులు
- యాదమరి–గుడియాత్తం రోడ్డు మరీ ఘోరం
- పట్టించుకోని పాలకులు

పూతలపట్టు: యాదమరి మండల కేంద్రం నుంచి పరదరామి వరకు రోడ్ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. సుమారు 15 కిలోమీటర్ల వరకు రోడ్డు మార్గంలో ఎటుచూసినా గుంతలే కనిపిస్తున్నాయి. పాలకులు, అధికారులు అదే మార్గంలో ప్రయాణిస్తున్నా మరమ్మతుల ఊసే ఎత్తడం లేదు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఆ మార్గంలో ప్రయాణం మరీ ఇబ్బందికరంగా మారింది.

వర్షమొస్తే ఇంతే..!

వర్షాకాలంలో యాదమరి–గుడియాత్తం రోడ్డులో గుంతలు నీటితో నిండిపోయి ప్రమాదాలకు తావిస్తున్నాయి. యాదమరి నుంచి పరదరామి వరకు సుమారు 30 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు చిత్తూరు నుంచి వెళ్లడానికి ఈ మార్గమే తప్ప మరొకటి లేదు. ఇక వెళ్లక తప్పదు అనుకున్న పక్షంలో తమిళనాడులోని కాట్పాడికి వెళ్లి అక్కడి నుంచి లత్తేరి వైపుగా పరదరామికి చేరుకుని మండలానికి రావాల్సిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు మరమ్మతులకు కూడా ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు. అయితే ఆ దిశగా చర్యలు ఇప్పటివరకు తీసుకోకపోవడంతో రోడ్లకు మోక్షం ఎప్పుడోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు సైడు జారి ప్రమాదాలకు గురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం ఈ రోడ్డు నుంచి అవస్థల నడుమ వెళ్లాల్సి వస్తోంది. కాశిరాళ్ల, భూమిరెడ్డిపల్లె, ముద్దురామాపురం, పత్రపల్లె, తెళ్లరాళ్లపల్లె తదితర గ్రామాల మీదుగా ప్రజలు వాహనాలపై వెళ్తుంటారు. రాత్రిపూట ఈ రోడ్డు మీద వెళ్తూ ఎదురు వచ్చే వాహనాలు తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని పాలకులు

అంతేగాక గ్రామీణులు మండల కేంద్రమైన యాదమరికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే గ్రామీణులు ఈ రోడ్ల మార్గంలో నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్డు గోతులమయమై ఎగుడు దిగుడు ఉండడంతో ప్రయాణికులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు సైతం ఫీట్లు చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి గుంతల్లో ఒరిగిపోయి త్రుటిలో ప్రమాదాల బారినుంచి తప్పించుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇకనైనా పాలకులు రోడ్ల దుస్థితిపై దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్పత్రికి వెళ్లాలంటే గంట

తెళ్ళరాళ్లపల్లె, పత్రపల్లె, భూమిరెడ్డిపల్లె, కాశిరాళ్ల తదితర గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో అత్యవసర వైద్యసేవలకు నరకప్రాయమైన మార్గంలో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లడానికి సుమారు గంట పైనే పడుతోంది. 15 రోజుల క్రితం మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు రోడ్డు మార్గంలో గుంతలో పడి మృతి చెందడం రోడ్డు దురవస్థలకు అద్దం పట్టింది. ప్రజలను ఆందోళనకు గురిచేసింది. అంతేగాక గుడియాత్తం రోడ్డువైపు నున్న కె.కొత్తూరు బ్రిడ్జి శిథిలావస్థకి చేరి కూలేలా ఉంది. ఇలాగే పరదరామి వరకు దాదాపు రెండు పెద్ద బ్రిడ్జిలు ఉండగా, మరో 10 వరకు చిన్న బ్రిడ్జిలు ఉన్నాయి. భారీ బ్రిడ్జిలు కె.కొత్తూరు గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి నిర్వహణ లేకపోవడంతో వర్షాలకు దెబ్బతిని భారీ సైజు గుంతలు ఏర్పడ్డాయి. వారం క్రితం తమిళనాడుకు చెందిన లారీలు చిత్తూరుకు వస్తుండగా పత్రపల్లెలోని గుంతలో కూరుకుపోయి గంట సేపు వాహనం ముందుకు కదల్లేదు. రోడ్డు బ్లాక్ కావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. స్థానికులు ఓ జేసీబీ సాయంతో గుంతలను పూడ్చివేసిన అనంతరం వాహనాలు ముందుకు కదిలాయి. ఆ జేసీబీకి 3000 వేల రూపాయల ఖర్చును స్థానికులే భరించారు.


గుంతల రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులు


కాశిరాళ్ల నడిరోడ్డులో భారీ గుంత


పత్రపల్లె వద్ద రోడ్డులో చిన్నపాటి కుంటను తలపిస్తున్న భారీ గుంత

13 మంది ఉద్యోగాలకు ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : సీ–డాప్ కనెక్ట్ కార్యక్రమంలో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ నాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ శిక్షణ ప్రాంగణంలో సీ–డాప్ జాబ్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. జిల్లా పరిధిలో 20 ఖాళీలను భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలకు 60 మంది హాజరయ్యారని, వారిలో 13మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. సీ–డాప్ జేడీఎం సరితారెడ్డి మాట్లాడుతూ, సీ–డాప్ జాబ్ కనెక్ట్ కార్యక్రమంలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యంతో పాటు మానవ వనరులను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్ స్టేట్ హెడ్ అనిల్, సీ–డాప్ సిబ్బంది లోకేష్, చిట్టిబాబు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి తోటల పెంపకంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని, ప్రధానంగా రైతులు తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మామిడిలో ఈగ తెగులు నివారణపై మంగళవారం స్థానిక ఉద్యాన శాఖ సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (హైదరాబాద్), రీజినల్ హార్టికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి తోటల్లో ఈగ తెగులు కారణంగా పంటకు తీరని నష్టం వాటిల్లుతోందన్నారు. దీని నివారణకు ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి తయారు చేసిన బుట్టలను చెట్లకు కడితే ఈ తెగులును అరికట్టవచ్చన్నారు. అలాగే సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రెప్కో బ్యాంకు వార్షికోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రెప్కో బ్యాంక్ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తోందని ఆ బ్యాంకు చిత్తూరు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జె. రిషి అన్నారు. చిత్తూరులో మంగళవారం ఆ బ్యాంకు 56వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ 560 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకంలో వడ్డీరేటు తమ ఖాతాదారుల కోసం ప్రారంభించామన్నారు. ఈ పథకంలో వడ్డీరేటు ప్రస్తుత బ్యాంకింగ్ రంగంలోనే మొట్టమొదటిసారిగా అత్యధికంగా ఇస్తున్నట్టు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు భాగస్వామ్యంగా ×మొక్కలు పెంచుదాం× అనే నినాదంతో తమ బ్యాంకు వివిధ శాఖలతో మొక్కల పెంపకంపై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయ ఆవరణలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారులు సమస్యలను తెలియజేయాలని కోరారు.

ప్రసూతి వార్డులో ప్రసాదాల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి విభాగంలో మంగళవారం సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు విభూది, స్వామి చిత్రపటం, చిక్కీలు, పండ్లు, బ్రెడ్లు, చిన్న పిల్లలకు దుస్తులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్


తవణంపల్లె: దిగువ మత్యంలో..

ఐరాల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని నాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దిగువమత్యంలో..

తవణంపల్లె: మండలంలోని దిగువ మత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులు, గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ పుస్తకాలతో ఉద్యోగం సాధించా

- వారోత్సవాల్లో ఇన్‌చార్జ్ డీపీఓ పార్వతి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీపీఓ పార్వతి

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి పోటీ పరీక్షలకు రాసి తాను ఉద్యోగం సాధించినట్లు ఇన్‌చార్జి డీపీఓ పార్వతి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాలకు పంచాయతీల నుంచి రావాల్సిన సెస్‌ను జమ చేయడానికి కృషి చేస్తామన్నారు. చిన్నతనం నుంచి గ్రంథాలయాలకు వెళ్లడం తనకు ఇష్టమన్నారు. లోకజ్ఞానం పెంచుకోవడానికి పుస్తకాలను చదవాలని పీసీఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పూర్వాణి తెలిపారు. మానవతా విలువల గురించి విద్యార్థులకు విజయం పాఠశాల కరస్పాండెంట్ శైలజ, పుస్తకాల ప్రాధాన్యం గురించి రచయిత్రి అరుణకుమారి, జీవితంలో ఎదుగుదల అంశంపై ఉపాధ్యాయుడు ఆనందనాయుడు మాట్లాడారు. వారోత్సవాల్లో ముగింపు రోజు బుధవారం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, గజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ

పూతలపట్టు: మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా సాధికారతపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా అన్నింటా రాణిస్తున్నారన్నారు. అయితే కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యవివాహాలు చేస్తు వారి జీవితాలను నాశనం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రమూ తగదన్నారు. ఆడపిల్లలను బాగా చదవనివ్వాలని, వారు జీవితంలో ఎదిగేలా స్వేచ్ఛనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు కృష్ణవేణి, లలిత, సుధాదేవి, గ్రంథాలయాధికారి రవీంద్రబాబు పాల్గొన్నారు.

టీటీడీ నిర్ణయంపై హర్షం

చిత్తూరు కార్పొరేషన్: తిరుమలలో హిందుయేతర ఉద్యోగులు పని చేయరాదని టీటీడీ పాలక మండలి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీశ్వరనాయుడు, శ్రీనివాసులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆ ఉద్యోగులను బదిలీ చేయడం లేదా వీఆర్‌ఎస్ ఇస్తామని చెప్పడం మంచి నిర్ణయమన్నారు. హిందూ ధర్మం, ఆచారాలపై అవగాహన లేని ఉద్యోగులు భక్తులకు సేవ చేయడంలో న్యాయం చేయలేరని గతంలో బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసినట్టు పేర్కొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి


మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న

ఐరాల: రైతులు సాగులో పంటల మార్పిడి పద్ధతి పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ ఉమ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్రాంపల్లె, 45 కొత్తపల్లెలో ఐరాల ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏతోపాటు డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడారు. ప్రతిసారి ఒకే రకమైన పంట సాగు చేయకుండా తరచూ మార్పిడి చేస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చన్నారు. పంటలు సాగు చేసే సమయంలో లోతుగా దుక్కులు, విత్తనశుద్ధి, కొత్త వంగడాల ఎంపిక, అవసరమైన మేర ఎరువుల వాడకం, సేంద్రియ ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ తదితర యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ దీపిక, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది భారతి, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

ఐరాల: విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలే కాకుండా అందుబాటులోని గ్రంథాలయాలు సందర్శిస్తూ పఠనాసక్తిని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ ధనలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, కథలు, అన్ని రకాల పుస్తకాలు చదవడం వలన ఎంతో జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. బాలికలు ఆపద సమయంలో ధైర్యంగా ఉండి సమస్యలు ఎదుర్కోవాలని, అలాగే సమయస్ఫూర్తి, ధైర్యం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎం కోమల మాట్లాడుతూ, పుస్తకాలతో మాత్రమే మేథోశక్తి పెంచుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవ ముగింపు రోజున బహుమతులు అందిస్తామని సుజాత తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెడ్డిశేఖర్, సచివాలయ మహిళా పోలీసు భవ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో సంకటహార చతుర్థి


పూజలు చేస్తున్న అర్చకులు


వ్రతమాచరిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకటహార చతుర్థి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. అలాగే ఉత్సవమూర్తిని అలంకరించి పల్లకి లో ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. అక్కడి వేదికపై స్వామి వారిని ఆశీనులు చేసి వేద పండితులు భక్తులతో శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. వ్రత ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ గురుప్రసాద్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు, రవి పాల్గొన్నారు.

వ్రతానికి భక్తుల తాకిడి

ప్రతినెలా సంకటహార చతుర్థి వ్రతానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఉపవాస దీక్షలతో వ్రతమాచరించడానికి రాష్ట్ర వాసులే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి సైతం భక్తులు వస్తున్నారు. తొలుత ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నారు.